## క్లుప్తంగా

### జగన్‌మోహన్‌రెడ్డి జన్మ దినోత్సవానికి తరలిరండి

● మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర


మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: జననేత, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవానికి సాలూరు నియోజకవర్గం లోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు తరలిరావాలని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ, శనివారం ఉదయం జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయితే వర్షతీవ్రత అధికంగా ఉంటే పట్టణంలోని తన ఇంటివద్దే ఈ వేడుకలు నిర్వహిస్తామని, వర్షం తెరిపిస్తే పట్టణంలో వైఎస్సార్‌కూడలి వద్ద ఈ వేడుకలు నిర్వహించనున్నామని తెలిపారు. పార్టీ శ్రేణులు గమనించాలని కోరారు.

### పరామర్శ


శ్రీను తల్లి సీతమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: ఎలక్ట్రానిక్ మీడియా సాక్షి జర్నలిస్ట్ నల్లి శ్రీనివాసరావు తల్లి సీతమ్మ సంవత్సరీకానికి మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర హాజరయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పట్టణంలోని బోనువీధిలో గల శ్రీను ఇంటికి వెళ్లి పరామర్శించారు. సీతమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

### స్వర్గధామానికి రహదారి సౌకర్యం


అంటిపేట స్వర్గధామంలో చదును చేస్తున్న జేసీబీ

సీతానగరం: మండలంలోని అంటిపేట గ్రామంలో స్వర్గధామానికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉండడంతో సర్పంచ్ బి. తిరుపతిరావు, ఎంపీటీసీ ఎస్.నిర్మల ఆధ్వర్యంలో స్వర్గధామం లో శుక్రవారం రహదారి మరమ్మతులు ప్రారంభించారు. ఈ మేరకు సర్పంచ్ తిరుపతిరావు మాట్లాడుతూ గ్రామంలో ఎవరు మృతిచెందినా మృతదేహాన్ని స్వర్గధామానికి సాగనంపడానికి వారి కుటుంబసభ్యులు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా తక్షణమే స్వర్గధామానికి రహదారి సౌకర్యం కల్పించడానికి యంత్రంతో పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ డీసీసీబీ డైరెక్టర్ కృష్ణంనాయుడు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.తిరుపతిరావు తెంటు శంకరరావు, అప్పయ్యమ్మ పాల్గొన్నారు.

### నేడు మహిళా సాధికారత అవగాహన సదస్సు

పార్వతీపురంటౌన్: కొమరాడ మండల ప్రజా పరిషత్ కార్యాలయం దగ్గర ఏర్పాటు చేసిన వేదిక నుంచి శనివారం ఉదయం 10:30నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మహిళ సాధికారత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా రెండవ అదనపు జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ అధ్యక్షుడు ఎస్. దామోదరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్వతీపురం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మహిళల కోసం ఎన్‌సీడబ్ల్యూ సహకారంతో చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. ఈ సదస్సులో మహిళా శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ, మెప్మా, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి, మత్స్యశాఖ సహాయ సంచాలకులు, వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు, వికలాంగుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు పాల్గొంటారని తెలిపారు. మహిళలు, పిల్లల ప్రయోజనం కోసం వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సదస్సు పాల్గొన్న వారికి అవగాహన కల్పిస్తారన్నారు. ఈ సదస్సులో కొమరాడ మండలానికి చెందిన భవన నిర్మాణ కార్మికులు, వ్యవసాయ, మత్స్యకార మహిళలు, ఇంటిపని మనుషులు, వికలాంగ మహిళలు, అసంఘటిత కార్మికులు, గిరిజన మహిళలు అధికసంఖ్యలో పాల్గొని జిల్లా అధికారుల నుంచి సలహాలు, సూచనలు తీసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రకటనలో కోరారు.


తయారైన చీరలు


చీర తయారీకి గంజి పెడుతున్న కార్మికులు

# చేనేత చీరలకు C/o నారాయణ పురం

● 100 కౌంట్ చీరలకు గ్రామం ప్రసిద్ధి
● రాజమండ్రి, హైదరాబాద్, ఢిల్లీలలో విక్రయాలు
● ఎగ్జిబిషన్‌లలో ప్రదర్శనలు
● ఒకే జిల్లా ఒకే ప్రొడక్టుకు ఎంపిక

బలిజిపేట:

మండలంలోని నారాయణపురంలో తయారవుతున్న 100కౌంట్ చేనేత చీరలు ప్రసిద్ధి చెందాయి. దేశంలో ఈ తరహా చీరలను బలిజిపేట మండలంలోని నారాయణపురంలోనే తయారు చేస్తుండడంతో ఒకే జిల్లా..ఒకే ప్రొడక్టు కింద హ్యాండ్‌లూమ్/ టెక్స్‌టైల్స్ వారు ఆన్‌లైన్‌లో కేంద్ర ప్రభుత్వానికి పరిశీలన నిమిత్తం దరఖాస్తు చేశారు. దీనిపై ఇటీవల ఒక బృందం వచ్చి వాటిని పరిశీలించి నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించింది.


ఉపయోగించే సన్నని దారం

● చేనేత కార్మికుల చరిత్ర

ఈ గ్రామంలో 1957నుంచి చేనేత కార్మికులు ఎక్కువగా ఉండేవారు. అప్పట్లో 150కుటుంబాలు చేనేత వృత్తిపై ఆధారపడి జీవించేవి. అప్పట్లో వీరు చరఖాపై నూలు వడకడం చేసేవారు. పని నైపుణ్యాన్ని పెంచుకుని చీరలను నేయడం ప్రారంభించారు. ఇందుకు వీరికి నూలు అందుబాటులో ఉండేది కాదు. గ్రామంలో ఏర్పాటుచేసుకున్న శ్రీనీలకంఠేశ్వర చేనేత సొసైటీ ద్వారా నూలు అందుబాటులోకి వచ్చింది. వీటి తయారీలో 40, 60, 80వ నంబర్ చీరలు, పంచలను నేసేవారు. వాటిని శ్రీ నీలకంఠేశ్వర చేనేత సొసైటీకి ఇచ్చేవారు. సొసైటీద్వారా విక్రయాలు జరగడంతో చేనేత కార్మికుల చేతికి సక్రమంగా, సకాలంలో డబ్బు అందేది కాదు. దీంతో వారి జీవనం దుర్భరంగా తయారైంది. దీంతో కొంతమంది వృత్తిపని మానివేసి వేరే మార్గాలను ఎంచుకున్నారు. మిగిలినవారు బయటకు వెళ్లలేక, చేస్తున్న వృత్తిని వదలలేక ఆకలిమంటలతో మగ్గాన్ని తిప్పుతూ జీవనం సాగిస్తున్నారు. మారుతున్న వ్యవస్థ, టెక్నాలజీ, చీరల వినియోగాన్ని అనుసరించి వారి వృత్తి నైపుణ్యాన్ని మార్చాలనుకుని కొత్త రకం తయారీకి శ్రీకారం చుట్టి 100కౌంట్ చీరల నేత ప్రారంభించారు.

### ఒక జిల్లా ఒక ప్రొడక్టుకు ఎంపిక చేయాలి:



నారాయణపురంలో తయారవుతున్న 100కౌంట్ చీరలు ఒక జిల్లా ఒక ప్రొడక్టుకు ఎంపిక చేయాలని కోరుకుంటున్నాం. నేత ఎంత కష్టమైనప్పటికీ, తక్కువ ఆదాయం వచ్చినప్పటికీ ఓర్చుకుని పనిచేస్తున్నాం.
– కాలేపు వీర్రాజు, చేనేత కార్మికుడు, నారాయణపురం

### చేతికి పనిదొరుకుతుంది



100కౌంట్ చీరల తయారీవల్ల చేతికి పని దొరుకుతుంది. కష్టం, ఖర్చు ఎక్కువైనా పనిలో సంతృప్తి కలుగుతుంది. ఏదోవిధంగా జీవనం సాగిస్తున్నాం. మా బతుకులు మరింత బాగుండి, మేము అభివృద్ధి సాధించేందుకు అందరూ సహకరించాలని కోరుకుంటున్నాం.
– బల్లా సత్యవతి, చేనేత కార్మికురాలు, నారాయణపురం, బలిజిపేట మండలం

### మృదుత్వంతో కూడుకున్న చీరలు

100కౌంట్ చీరలు ఎంతో మృదువుగా తేలికగా ఉండే రకం. మిగిలిన రకాలతో పోల్చితే తేలికగా ఉంటాయి. దీని తయారీకి సన్నని నూలు వినియోగిస్తారు. చీర తయారీకి వడకడం, సరిచేయడం పనులు ఎంతో కష్టం. పడుగు పేక నేయడం చాలా కష్టమైన పని అని చేనేత కార్మికులు తెలిపారు. సన్నని నూలు అవడంతో తెగిపోకుండా చూసుకోవాలి. రంగులనేత, బట్ట డిజైన్లు తయారుచేయాలి. చేనేత కార్మికులు చీర తయారీకి సంబంధించి నూలు ఆప్కో, మాస్టర్ వీవర్స్ ద్వారా సరఫరా అవుతుంది. చీర ఐదున్నర మీటర్లు ఉంటుంది. దీనికి బ్లౌజు ఉండదు. అన్నింటికి కలిపి రూ.570కు పైగా ఖర్చవుతుందని చేనేత కార్మికులు చెబుతున్నారు. మార్కెట్‌లో దీనిని రూ.850కి విక్రయిస్తున్నారు. దీనిపై రోజంతా కష్టపడితే నెలకు రూ.15వేల వరకు మాత్రమే ఆదాయం సమకూరుతుందని చేనేత కార్మికులు చెబుతున్నారు.

● ఇతర ప్రాంతాల్లో విక్రయం

ఇక్కడ తయారుచేసిన చీరలు ఆప్కో, మాస్టర్ వీవర్స్‌కు విక్రయిస్తున్నాం. వారు రాజమండ్రి, హైదరాబాద్, ఢిల్లీ వరకు పంపించి విక్రయాలు చేస్తున్నారు. దీనివల్ల ఒకే జిల్లా ఒకే ప్రొడక్టుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశామని గ్రామస్తులు తెలియజేశారు.

## 19 గంటలు విద్యుత్ అంతరాయం

బలిజిపేట: మండలంలోని చిలకలపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో వెంగాపురం, తుమరాడ గ్రామాల్లో 19గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడంతో వినియోగదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. గురువారం రాత్రి 9గంటల నుంచి శుక్రవారం సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. గురువారం రాత్రి రెండు గ్రామాలకు చెందిన ఏబీ స్విచ్ పాడవడంతో రాత్రంతా అంధకారంలో మగ్గవలసి వచ్చిందని వినియోగదారులు తెలిపారు. గతంలో అర్ధరాత్రి సమయంలోనూ అంతరాయం కలిగినా స్పందించి మరమ్మతులు చేసేవారని, ఇప్పుడు పట్టించుకోవడం లేదని వినియోగదారులు చెబుతున్నారు. శుక్రవారం ఉదయం బ్రేక్‌డౌన్ అని విద్యుత్ సరఫరా జరగలేదు. మొత్తం మీద 19గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


తుమరాడలో ట్రాన్స్‌ఫార్మర్

## పశుగణన వేగవంతం చేయాలి


రైతు ఇంటివద్ద పశుగణనను పరిశీలిస్తున్న జిల్లా అధికారి డాక్టర్ మన్మథరావు

సీతానగరం: జిల్లాలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పశుగణన నిర్వహణ సిబ్బంది వేగవంతం చేయాలని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి ఎస్.మన్మథరావు అన్నారు. పశుసంవర్ధక శాఖ సీతానగరం సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న లక్ష్మీపురంలో వీహెచ్‌ఏ బి.పద్మ నిర్వహిస్తున్న హౌస్‌హోల్డ్ పశుగణన సర్వే కార్యక్రమాన్ని సీతానగరం ఎ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్‌తో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అఖిల భారత పశుగణన చేయాలని జారీ చేసిన మార్గదర్శకాలననుసరించి అక్టోబరు 25 తేదీ నుంచి ప్రారంభించిన పశుగణన 2025 ఫిబ్రవరి 28 వరకూ పశువైద్యాధికారుల పర్య వేక్షణలో సిబ్బంది దినసరి విధులు నిర్వహిస్తూనే సర్వేలో పాల్గొంటున్నారన్నారు. నిర్ణయించిన గడువులోగా సర్వే పూర్తి చేయడానికి చర్యలు చేపట్టామన్నారు. పశుసంవర్ధక శాఖ ఎ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్ మాట్లాడుతూ సీతానగరం సబ్‌డివిజన్‌లోని రెండుమండలాల్లో పశుగణన వేగవంతం చేయాలని కోరామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసాద్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## సీసీరోడ్లు, కాలువల నిర్మాణం

సీతానగరం: మండలంలోని మేజర్ పంచాయతీ పెదభోగిలిలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేయడానికి పాలకవర్గం సిద్ధం చేసిందని మండల పీఆర్ ఇంజినీరింగ్ అధికారి జి.చంద్రమౌళి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ పంచాయతీలోని మెట్టువీధిలో గతంలో వివిధ కారణాలతో అసంపూర్తిగా సీసీరోడ్డు, కాలువల నిర్మాణాలు నిలిచిపోయాయన్నారు. ఇప్పుడా పనులను సర్పంచ్ జే.తేరేజమ్మ, ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యుల సూచన లమేరకు మూడువీధులలో 170 మీటర్ల సీసీ కాలువలు, 20 సీసీరోడ్డు వేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈఓ రమేష్‌కుమార్, పంచాయతీ వార్డు సభ్యుడు జె.గరికయ్య పాల్గొన్నారు.


మెట్టు వీధిలో జరుగుతున్న సీసీ కాలువ పనులు

## అమిత్‌షా క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలి


పట్టణంలో నిరసన తెలుపుతున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్

పార్వతీపురంటౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్‌పై అనుచితంగా పార్లమెంట్‌లో మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తక్షణమే దేశ ప్రజలకు క్షమాపణ చెబుతూ వెంటనే రాజీనామా చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ అమిత్‌షా బహిరంగ క్షమాపణ చెప్పాలని, కేంద్రప్రభుత్వం అయనను అరెస్టు చేయాలంటూ పట్టణంలో నిరసన వ్యక్తం చేశారు. అలాగే బీజేపీ మతోన్మాద చర్యలు దేశంలో మితిమీరాయని మండిపడ్డారు. మనుధర్మశాస్త్రాన్ని తమ రాజ్యాంగంగా మార్చుకుని అమలు చేయాని బీజేపీ ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. ప్రపంచ దేశాలే మేధావిగా గుర్తించిన బీఆర్ అంబేడ్కర్ చిరస్మరణీయుడని, యావత్ ప్రపంచం భావిస్తోందన్నారు. ఆయన ఆశయాలను, ఆలోచనలను అమలు చేస్తామని అంటూనే ఆయనకు బదులుగా దేవుడి పేరు స్మరించాలని చెప్పడం వెనుక అమిత్‌షా అసలు ఉద్దేశం బట్టబయలైందన్నారు. దేశ ప్రజల ఆరాధ్యదైవం అంబేడ్కర్‌ను కించపరిచి దేశ సమస్త ప్రజల మనోభావాలను తీవ్రంగా గాయపరిచారని ఆయన చెప్పారు. పార్లమెంట్‌లోనే అంబేడ్కర్‌ను అవమానించినందుకు తక్షణం ఆయనను అరెస్టు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దీనిపై కేంద్రం స్పందించకపోతే తమ పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. అమిత్ షా వ్యాఖ్యలను ప్రధాని మోదీ సమర్థించడం సిగ్గుచేటన్నారు. దీంతో దేశ ప్రజలపై బీజేపీ చూపిస్తున్న కపట ప్రేమ అర్థమవుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సూరయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

### ఘనంగా గోదాదేవికి పూజలు


గోదాదేవిని పల్లకీలోకి తెస్తున్న అర్చకులు

సీతానగరం: మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం గోదాదేవి అమ్మవారికి అభిషేకాలు, పూజలు, పల్లకిలో తిరువీధి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ మేరకు అర్చకుడు భరత్ మాట్లాడుతూ ధనుర్మాసం రావడంతో గోవిందమాలలు ధరించిన భక్తులు ప్రతిరోజు వేకువజామున గోవింద నామాలు ఆలపిస్తూ వేణుగోపాలస్వామి ఆలయం నుంచి కిలోమీటరుదూరంలో ఉన్న హనుమాన్ జంక్షన్ వరకూ తిరువీధి, నగర సంకీర్తనలు చేస్తారన్నారు. భోగి పండగ వరకు ఉత్సవాలు జరుగుతాయని తెలియజేశారు. నగరసంకీర్తన అనంతరం ఆలయంలో పూజలు చేసి తిరుగు ప్రయాణం చేశారు.అర్చకులు భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

## పవన్ అభిమానుల్లో నిరుత్సాహం


పట్టణంలో డిగ్రీ కళాశాల వద్ద అభిమానులు, ప్రజలకు అభివాదం చేస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్


పట్టణంలో మెయిన్‌రోడ్డు వద్ద నిలిచిన వాహనాలు

సాలూరు: తమ అభిమాన సినీనటుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను చూసేందుకు శుక్రవారం సాలూరు పట్టణానికి వచ్చిన ఆయన అభిమానులు, పలువురు జనసేన శ్రేణులకు కొంతమేర నిరుత్సాహమే మిగిలింది. ఆయన రాక కోసం ఉదయం 9గంటల నుంచి జోరువానలోను అభిమానులు పట్టణంలో వేచిఉన్నారు. సుమారు 11.25 నిమిషాలకు పట్టణంలోకి చేరిన ఆయన డిగ్రీ కళాశాల వద్ద తన కారు నుంచే బయటకు వచ్చి సుమారు 30 సెకన్లు కనిపించి అందరికీ అభివాదం చేసి తిరిగి కారులో వెళ్లిపోయారు.పవన్‌కల్యాణ్ అభివాదం చేసే సమయంలో అభిమానులు కాబోయే సీఎం అంటూ నినాదాలు చేశారు. తరువాత పట్టణంలో ఇంకెక్కడా ఆయన కారు నుంచి బయటకు రాకపోవడంతో ఆయనను చూసేందుకు వచ్చిన అభిమానులు, జనసేన కార్యకర్తలు కొంత నిరుత్సాహపడ్డారు. వెంకటేశ్వర డీలక్స్, చినబజారు,మెయిన్‌రోడ్డు వద్ద భారీగా ప్రజలు ఉన్నప్పటికీ పవన్‌కల్యాణ్ వాహనం నుంచి బయటకు రాకపోవడంతో కొంత నిరుత్సాహంతో అందరూ వెనుదిరిగారు. ఉపముఖ్యమంత్రి కాన్వాయ్ వెంట పట్టణంలోని పలువురు అభిమానులు బైక్‌లతో ర్యాలీగా వెళ్లి తమ అభిమానాన్ని చాటుకున్నారు. పవన్‌కల్యాణ్ రాక నేపథ్యంలో పోలీసుల ట్రాఫిక్ ఆంక్షలతో పలువురు ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

## మొక్కుబడిగా మరమ్మతులు

బలిజిపేట: మండలంలోని చిలకలపల్లి–వంతరాం ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతులు మొక్కుబడిగా నిర్వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. 6 కిలోమీటర్ల రోడ్డు మరమ్మతులకు రూ.30 లక్షలు మంజూరవగా వాటితో పనులు నిర్వహిస్తున్నారు. ఈ నిధులతో రోడ్డుపై ఉన్న గోతులకు ప్యాచ్ వర్కులు, మూడు చోట్ల 200 మీటర్లకు వైట్‌మిక్స్‌తో రోలింగ్ చేసి తారువేయడం, బాగా పాడైన చోట్ల తారు వేసేందుకు నిధులు మంజూరైనట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ రామ్మోహన్ తెలిపారు. అయితే పనిచేసేవారు మాత్రం సక్రమంగా చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్డు మధ్యలో ఉండే గోతులను కప్పకుండా వదిలివేసి వెళ్లిపోవడంతో వాహన చోదకులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. మరమ్మతులంటే గోతులను వదిలేసి పనులు చేయడమేనా అని వాహనచోదకులు, అటువైపు వెళ్లేవారు ప్రశ్నిస్తున్నారు. అధికారులు పనులను పర్యవేక్షిస్తే ఇటువంటి సమస్యలు ఉండవని, అధికారులు ఇటువంటి వాటిని పర్యవేక్షించాలని కోరుతున్నారు. దీనిపై ఏఈ రామ్మోహన్‌ను వివరణ కోరగా అన్ని గోతులను పూడ్చుతామని, పూర్తిస్థాయి మరమ్మతులు చేపడతామని తెలిపారు.


మరమ్మతులు చేసినా హెచ్చుతగ్గులుగా కనిపిస్తున్న రోడ్డు


చిలకలపల్లి-వంతరాం రోడ్డు మధ్యలో కప్పకుండా వదిలివేసిన గుమ్మి

### దరఖాస్తుల ఆహ్వానం..

సీతంపేట: భామిని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఎకనామిక్స్ పోస్టు భర్తీకి సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ ఎకనామిక్స్‌లో కనీసం 50 శాతం మార్కులతో పాటు బీఈడీ, ఉపాధ్యాయ అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలని పేర్కొన్నారు. ఇంగ్లిష్ మీడియంలో బోధించాల్సి ఉంటుందని తెలిపారు.ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 28లోగా సీతంపేట గురుకులం సెల్, భామిని ఈఎంఆర్ఎస్‌లో దరఖాస్తులు అందజేయాలన్నారు.

### సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

● జిల్లా వైద్యారోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి జగన్ మోహన్‌రావు


కేఆర్‌బీ పురం పీహెచ్‌సీలో సిబ్బందికి సూచనలు చేస్తున్న డాక్టర్ జగన్ మోహన్‌రావు

కొమరాడ: గ్రామల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహన్‌రావు అన్నారు. మండలంలోని కొమరాడ, కేఆర్‌బీ పురం పీహెచ్‌సీలను శుక్రవారం ఆయన సందర్శించారు. అలాగే కుమ్మరిగుంట గ్రామంలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు.ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. మలేరియా, డెంగీ, డయేరియా ప్రబలకుండా ఏమేం జాగ్రత్తలు పాటించాలో వివరించారు. అంతకుముందు పీహెచ్‌సీ రికార్డులను పరిశీలించి, రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యులు శిరీషా, గణేష్ పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.